

ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

## ఫాక్స్‌కాన్ తొలిదశ ప్రారంభానికి సిద్ధం

- దీనిద్వారా 20వేల మందికి ఉపాధి
- రెండో దశ పూర్తయితే 80వేల మందికిపైగా అవకాశాలు : ఎక్స్ వేదికగా కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఫాక్స్‌కాన్ సంస్థ తొలిదశ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో ఆ కంపెనీ విస్తరణ ప్రణాళికలు ఎంతవరకు వచ్చాయో తెలియవని పేర్కొన్నారు. 1.6 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో మొదటి దశ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయిందని, ఇందులో దాదాపు 20 వేల మందికి పైగా ఉపాధి దొరుకుతుందని వివరించారు. బుధవారం సోషల్ మీడియాలో ముత్తుకృష్ణన్ సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఫాక్స్‌కాన్ సంస్థ రెండో దశలో 6.8 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో $582 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలనే ఆలోచన ఉన్నదని తనకు తెలిసిందని చెప్పారు. రెండో దశ తర్వాత సంస్థలో మొత్తం 80 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అదనంగా 400 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలనే ఉద్దేశం కూడా ఉన్నదని, కానీ అక్కడ ఏం జరుగుతున్నదో తనకు పూర్తి సమాచారం తెలిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్‌కు సంబంధించి 2023లో కేసీఆర్ నాయకత్వంలో అవగాహన ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు.

# ప్రజల ప్రాణాలతో సర్కార్ చెలగాటం

- పల్లె ప్రగతికి పాతర.. పట్టణ ప్రగతి మాయం
- నిధులు లేక సంక్షోభంలో చిక్కుకున్న స్థానిక సంస్థలు
- 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన 500 కోట్లు పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారు?
- ఉపాధిహామీ, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన 2,100 కోట్లు ఎందుకు దారి మళ్లించారు?
- మున్సిపాలిటీలకు 1,200 కోట్లకుపైగా బాకీ
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



> బీఆర్‌ఎస్ హయాంలో పదేండ్లు పచ్చగా కళకళలాడిన పల్లెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇది కాంగ్రెస్ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదన్న విషయాన్ని మరచిపోవద్దు. -కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అంటే గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధులు లేక, పెండింగ్ బిల్లులు రాక పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయని, పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందంటూ బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ఆరోపించారు. పల్లెలపై ఎందుకింత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో పాలన పడకేసిందని, పట్టణాల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని దుయ్యబట్టారు. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణను పట్టించుకోకపోవటంతో పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారిందని, దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు

పంచాయతీల్లో పాత పనుల బిల్లులు చెల్లించడం లేదని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1,800 మంది మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు ప్రయోగిస్తూ, అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2,100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మొత్తం 12,769 పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలే రూ.4,305 కోట్లు ఉన్నాయని, వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పల్లెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాపాలనలో పల్లెప్రగతికి పాతరేసి.. పట్టణప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా? అని నిలదీశారు. మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మతులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పట్టణ సంస్థల్లో జీతాలు ఇవ్వలేని దుస్థితి

మున్సిపాలిటీల్లో రూ.1,200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఎప్పుడు విడుదల చేస్తారని కేటీఆర్ నిలదీశారు. ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే, ఇతర శాఖల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రేటర్‌తోపాటు రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి ఉన్నదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 'ఆగస్టు 15లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ప్రభుత్వానికి ఉన్నదా? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గట్టెక్కించే ధైర్యం ఉన్నదా? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉన్నదా?' అని నిలదీశారు.

## లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలి

- లేదంటే సీఎం ఇంటిని ముట్టడి
- గిరిజన విద్యార్థి సంఘం నేత

ఖైరతాబాద్, ఆగస్టు 14: లంబాడాల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు, వారికి ఒక్క మంత్రి పదవిని కూడా కేటాయించకుండా అవమానిస్తున్నదని, తక్షణమే లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడా జనాభా ఉన్నదని, తమను ఏదో ఉద్ధరిస్తుందని కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తండాలను పంచాయతీలుగా మార్చారని, ప్రతి పంచాయతీకి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఆంధ్రా పెట్టుబడిదారీ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, దీన్ని నిరసిస్తూ ఈ నెల 29న రెండు కార్పొరేట్ విద్యాసంస్థలను ముట్టడిస్తామని, గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకుంటే అక్టోబర్ 1న సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని చెప్పారు.

## నందినికి సాయమేది?

- ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి
- ఇంటిస్థలం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఏషియన్ గేమ్స్‌లో కాంస్యం సాధించిన అగసార నందినికి సాయమెందుకివ్వలేదని రాష్ట్రప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. రెజ్లర్ ఫొగాట్‌కు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ అండగా ఉంటామని చెప్పారని, కానీ రాష్ట్రంలో ఓ అథ్లెట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. అథ్లెట్ అంటే సర్కారుకు చిన్నచూపా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ సిరాజ్, ఈషా సింగ్ లాంటి వాళ్లతో పోలిస్తే నందిని పతకాలు తక్కువేం కాదని స్పష్టం చేశారు. కేవలం సంక్షేమ పాఠశాలలో చదివిందని, ఆమె తండ్రి ఇప్పటికీ రజక వృత్తిలో ఉన్నాడనే ఆమె విజయాలు కాంగ్రెస్ సర్కారుకు తక్కువగా కనిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. అందరిలాగానే తనకూ పారితోషికం, హైదరాబాదులో ఇంటిస్థలం కేటాయించమని నందిని సాక్షాత్తు ముఖ్యమంత్రిని కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. క్రీడాకారిణి నందినికి కూడా నగదు బహుమతి ఇవ్వాలని, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

# పాత గోడకు కొత్త సున్నం

- రేవంత్ విదేశీ పర్యటనపై బీఆర్‌ఎస్ నేత వ్యాఖ్య
- సీఎం పర్యటనపై శ్వేతపత్రం ప్రకటించాలి: విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పాత గోడకు కొత్త సున్నం కొట్టినట్టు ఉన్నదని బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండేండ్ల క్రితమే కాగ్నిజెంట్ సంస్థ తమ క్యాంపస్ విస్తరణకు ప్రణాళిక వేసిందని, ఆ విషయాన్ని ఆ సంస్థే ట్వీట్ చేసిందని తెలిపారు. సీఎం రేవంత్ యూఎస్ పర్యటనకూ కాగ్నిజెంట్‌లో ఆయన కార్యక్రమానికి సంబంధం లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి విష్ణువర్ధన్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విదేశీ పర్యటనలో వచ్చాయని చెబుతున్న పెట్టుబడులపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. గతంలో కేటీఆర్ పర్యటనల సందర్భంగా రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. కేటీఆర్ పర్యటనలను బీఆర్‌ఎస్ ఎప్పుడూ పబ్లిసిటీ కోసం వాడుకోలేదని అన్నారు. రేవంత్ పర్యటనలో మంత్రి శ్రీధర్‌బాబు ఉత్సవ విగ్రహంగా మారారని ఎద్దేవాచేశారు. జేఎస్‌డబ్ల్యు, వెబ్‌వర్క్స్ అనే కంపెనీలతో కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంటే వాటినే మళ్లీ రేవంత్ దావోస్‌లో కుదుర్చుకున్నారని తెలిపారు. సీఎం తాజా టూర్‌తో రూ.31,500 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్తున్నారని, ఆ లెక్క మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్న వారిలో చంద్రబాబు దోస్తులు ఉన్నారని చెప్పారు. రేవంత్ విదేశీ పర్యటన ద్వారా ఏ ఏ రూపాల్లో ఎన్ని పెట్టుబడులు సమకూరాయో శ్వేత పత్రం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలను బయటపెడుతున్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను కాంగ్రెస్ నేతలు, పోలీసులు బెదిరిస్తున్నారని చెప్పారు. రేవంత్ ఇప్పటికైనా గుంపు మేస్త్రీ తీరు ప్రచారాన్ని తగ్గించి ప్రజా సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు చెప్పారు.




# హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు రాష్ట్రపతి మెడల్

- ఈసారి తెలంగాణకు మాత్రమే పీఎంజీ అవార్డు
- వివిధ విభాగాల్లో రాష్ట్రానికి 29 పతకాలు
- ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్, సీపీ అవినాశ్ మొహంతికి మెడల్స్
- హెచ్‌సీ యాదయ్యను అభినందించిన డీజీపీ
- నాటి వీరోచిత పోరాటానికి దక్కిన గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : మాదాపూర్ సీసీఎస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్యను భారత ప్రభుత్వం ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ) అవార్డుతో గౌరవించింది. ఈ మేరకు డీజీపీ జితేందర్ బుధవారం తన కార్యాలయంలో పీఎంజీ మెడల్ పొందిన యాదయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ ఏడాది దేశంలోనే ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ఏకైక వ్యక్తి హెడ్ కానిస్టేబుల్ యాదయ్య కావడం తెలంగాణ పోలీసులకు గర్వకారణమని కొనియాడారు. పీఎంఎస్ మెడల్ అందుకోబోతున్న ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్‌ను సైతం డీజీపీ అభినందించారు. పోలీసు, ఫైర్, హోంగార్డ్స్ వంటి విభాగాల్లో తెలంగాణకు మొత్తం 29 మెడల్స్ వచ్చాయి. వీటిల్లో తెలంగాణకు ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ 1, మెడల్ ఫర్ గ్యాలెంట్రీ పోలీసు సర్వీసులో 7, ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ 3, (పోలీసు 2, ఫైర్ 1), మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ 18 (పోలీసు 11, ఫైర్ 2, హోంగార్డ్స్ 5) వచ్చాయి. దేశవ్యాప్తంగా ఒక పీజీఎం, 213 గ్యాలెంట్రీ మెడల్స్, 94 పీఎస్‌ఎం, 729 ఎంఎస్‌ఎం మెడల్స్‌ను పోలీసు, ఫైర్, హోంగార్డ్స్ అండ్ సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌లో ప్రకటించారు. తెలంగాణలో ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (పీఎస్‌ఎం) అందుకునే వారిలో టీజీఎస్పీ ఏడీజీ సంజయ్ కుమార్ జైన్, డీసీపీ కటకం మురళీధర్, అగ్నిమాపక శాఖ డ్రైవర్ ఆపరేటర్ కందిమళ్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.



యాదయ్యను అభినందిస్తున్న డీజీపీ జితేందర్

గ్యాలెంట్రీ మెడల్ పొందిన వారిలో ఖమ్మం కమిషనర్ సునీల్ దత్ ఐపీఎస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మోర కుమార్, ఆర్‌ఎస్‌ఐ శనిగరపు సంతోష్, కానిస్టేబుళ్లు అమిలి సురేశ్, వేముల వంశీ, కాంపాటి ఉపేందర్, పాయం రమేశ్ ఉన్నారు.

### మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ మెడల్స్..


మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ మెడల్స్ అందుకునే వారిలో పోలీసుశాఖ నుంచి సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి, కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, ఏఎస్పీ పీ కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ నూతలపాటి జ్ఞానసుందరి, ఎస్సైలు కొమరబత్తిని రాము, అబ్దుల్ రఫీక్, ఇక్రం ఏబీ ఖాన్, శ్రీనివాస మిశ్రా, కుంచాల బాలా కాశయ్య, ఏఎస్సైలు ఏ లక్ష్మయ్య, గుంటి వెంకటేశ్వర్లు ఉన్నారు. అగ్నిమాపకశాఖ విభాగంలో లీడింగ్ ఫైర్‌మెన్లు తెలుగు మాధవరావు, వహీదుద్దీన్ మహ్మద్ ఉన్నారు. హోంగార్డ్స్ అండ్ సివిల్ డిఫెన్స్ నుంచి హోంగార్డులు బందోళ్ల లక్ష్మి, మేడిపల్లి మల్లేశ్, ఇంటూరి కవిత, నామాల గాలయ్య, ఇనుముల సుమలత ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ యాదయ్యను సన్మానించిన కార్యక్రమంలో ఏడీజీలు సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, ఐజీ ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇదీ యాదయ్య వీరోచిత గాథ..

అది.. 2022 జులై 25. మాదాపూర్ జోన్‌లో సాయంత్రం ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న కే కాత్యాయని అనే 72 ఏండ్ల మహిళ మెడలోంచి బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. కాత్యాయని స్థానిక సీసీఎస్‌లో చైన్ స్నాచింగ్ జరిగినట్టు ఫిర్యాదు చేసింది. వారిని పట్టుకోవాలనే ఉద్దేశంతో సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్య తోటి కానిస్టేబుళ్లు ఎం రవి, ఏ దేభాశ్ సహకారంతో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించారు. కాత్యాయని చెప్పిన గుర్తుల ఆధారంగా మరుసటి రోజు (2022, జులై 26)న బొల్లారం క్రాస్‌రోడ్డు వద్ద కానిస్టేబుల్ ఎం కృష్ణ వారి జాడ కనుగొని వెంటనే యాదయ్య టీమ్‌కు సమాచారం ఇచ్చాడు. నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్న యాదయ్య బృందం చైన్ స్నాచింగ్‌లో కరుడుగట్టిన ఇషాన్ నిరంజన్, రాహుల్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో నేరస్తులు కత్తులతో దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో యాదయ్య ఛాతి, వీపు, చెయ్యి, కడుపు భాగాల్లో అనేకచోట్ల గాయాలైనా సర్వశక్తులూ ఒడ్డి పట్టుకున్నాడు. 'యాదయ్య అచంచలమైన స్ఫూర్తి, విధి నిర్వహణ ప్రతిపోలీసుకు ఆదర్శం' అని డీజీపీ జితేందర్ కొనియాడారు.

### ఇద్దరు ఆర్‌పీఎఫ్ సిబ్బందికి పోలీస్ మెడల్స్

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)కు చెందిన ఇద్దరు సిబ్బంది విశిష్ట సేవలకు గాను పోలీస్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. మెడల్స్ అందుకునే వారిలో హైదరాబాద్ డివిజనల్ రైల్వేకు చెందిన కామారెడ్డి ఆర్‌పీఎఫ్ (ఏఎస్‌ఐ) జే సుధాకర్, విజయవాడ డివిజనల్‌కు చెందిన ఏఎస్‌ఐ నయింబాషా షేక్ ఉన్నారు.




# బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 14: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి బీసీ యువతకు రూ.10 లక్షల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు గిరిగాని భిక్షపతి, దాసరిమూర్తి, సంయుక్త కార్యదర్శి సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి పాల్గొన్నారు.